అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌

నిజాంపేట్‌ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమలు చేసి, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్‌ అన్నారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ ఎం.డీ సాబెర్‌ అలీకి వినతిపత్రం అందజేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

సుభాష్‌నగర్‌: సీఎం రిలీఫ్‌ఫండ్‌ పథకంతో పేదలకు కార్పొరేట్‌ వైద్య సేవలు అందుతున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో తిరుపతి అనే లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కును అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనుల పండువగా ఆలయ వేడుకలు

కుత్బుల్లాపూర్‌: దండమూడి ఎన్‌క్లేవ్‌లోని పద్మావతి గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వారికి సేవాకాలం, ద్వారతోరణం, ధ్వజకుంభారాధన, చతుఃస్థానార్చన, మూల మంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, ఆరగింపు, సాయంత్రం 5.30 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, ద్వారతోరణ పూజ, నిత్యహవనం, పూర్ణాహుతి, బలిహరణం, స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర



హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్‌: గాజులరామారంలో రేణుకా ఎల్లమ్మదేవి జాతర 25వ రజోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం చండి నవగ్రహ సహిత లక్ష్మీ గణపతి హోమం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య జరిగింది. ఆదివారం ప్రధాన జాతర ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. ఈ జాతర 18 వరకు కొనసాగుతుందని తెలిపారు.

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం ఎమ్మెల్యే వివేకానంద్‌, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఠాకూర్‌ రాజేందర్‌ సింగ్‌, గోనె బల్వంత రెడ్డి, కూన రాంచందర్‌ గౌడ్‌, నల్ల లింగంగౌడ్‌, శివరాజ్‌, వెంకటేష్‌, జయశంకర్‌ గౌడ్‌, కూన శ్రీరాములు గౌడ్‌ పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎంసీహెచ్‌ఎస్‌, వివేక్‌ డెంటల్‌ల ఆధ్వర్యంలో ఉచిత దంత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంసీహెచ్‌ఎస్‌ పర్సనల్‌ చైర్‌ పర్సన్‌ హనుమంతరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు దంతాల సంరక్షణకు వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మోతీనగర్‌ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిఘా నేత్రం.. నేరాలు తగ్గుముఖం



- నేరాల నియంత్రణలో కీలకంగా సీసీ కెమెరాలు
- ఫుటేజీ సాయంతో నిందితుల గుర్తింపు
- ప్రజలకు అవగాహన కల్పించిన దుండిగల్‌ పోలీసులు
- స్టేషన్‌ పరిధిలో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా



నేరాలను అరికట్టడంలోనూ, నిందితులను గుర్తించడంలోనూ నేడు సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా భావిస్తాం. ప్రజలకు భద్రత కల్పించడంలోనూ దోహదపడుతాయి. నేరాలు చేసి తప్పించుకుంటున్న నిందితులను అదుపులోకి తీసుకోవడంలో పోలీసులకు సీసీ కెమెరాల ఫుటేజీలు కీలకం. చిన్న చిన్న దొంగతనాల నుంచి హత్యలు, దోపిడీలు చేసే వారిని సైతం పట్టిస్తున్నాయి. కెమెరాల వల్ల నేరాలు సైతం గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు దుండిగల్‌ పోలీసులు. – దుండిగల్‌

సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించిన కేసుల వివరాలు

- గత సంవత్సరం నవంబర్‌ 9వ తేదీన మల్లంపేట ప్రాంతానికి చెందిన శారద అనే మహిళ ఆమె ఇంట్లోనే దారుణ హత్యకు గురైంది. విచారణ సమయంలో పోలీసులకు ఎలాంటి ఆనవాలు దొరకలేదు. 10 కిలో మీటర్ల మేర సుమారు 60 సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు తనకు పరిచయస్తుడైన ప్రవీణ్‌ కుమార్‌ హత్య చేసినట్లు గుర్తించి కటకటాల వెనక్కి నెట్టారు.
- జనవరిలో నిజామాబాద్‌ జిల్లా బాన్సువాడకు చెందిన పాత నేరస్తురాలు గంగమణి అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితురాలు అంజమ్మ ఒంటిపై ఉన్న నగలపై కన్నేసింది. పని ఉందని నగరానికి తీసుకువచ్చి గండిమైసమ్మలోని ఓ నిర్మానుష ప్రాంతంలో ఆమెను హత్య చేసి నగలుతో ఉడాయించింది. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితురాలుని గుర్తించి పోలీసులు జైలుకు పంపారు.
- దుండిగల్‌ తండా 2 కు చెందిన శాంతి అనే మహిళ ఇంట్లో హత్యకు గురైంది. ఇంటి పక్కనే ఉండే కమల్‌ కుమార్‌ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ చార్జర్‌ విషయంలో తలెత్తిన వివాదంలో హత్య చేయగా.. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్‌ చేశారు.

సెక్టార్‌	కమ్యూనిటీలు	కెమెరాలు
బహదూర్‌పల్లి	08	79
గాగిల్లాపూర్‌/దుండిగల్‌	12	145
మల్లంపేట	28	524
మొత్తం	48	748

దుండిగల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో..

నేరాలకు పాల్పడే వారిని గుర్తించి తక్షణమే శిక్ష అమలు పరిచే విధంగా దుండిగల్‌ పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. మల్లంపేట, బౌరంపేట, దుండిగల్‌, గాగిల్లాపూర్‌, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఆయా ప్రాంతాల్లో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు స్థానికులతో పలు దఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఆయా కాలనీ సంఘాలు, పోలీసుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..



సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానిక సంక్షేమ సంఘాలు పూర్తిగా సహకరిస్తున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను అరికడుతున్నాం. కొన్ని క్లిష్టమైన కేసుల్లో సీసీ ఫుటేజీ ఎంతగానో దోహదపడుతున్నాయి. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ఆయా ప్రాంతాల్లో ఉన్న కెమెరాలను పోలీస్‌ స్టేషన్‌లోని కమాండ్‌ కంట్రోల్‌కు అనుసంధానం చేసి నిత్యం పర్యవేక్షిస్తాం.

– పి. సతీష్‌, దుండిగల్‌ సీఐ

విద్యుత్‌ సరఫరాపై కలెక్టర్‌ సమీక్ష



కలెక్టర్‌ గౌతమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యుత్‌ శాఖ ఉన్నతాధికారులు

కుత్బుల్లాపూర్‌: వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్‌ గౌతమ్‌ అన్నారు. శనివారం టీజీఎస్‌పీడీసీఎల్‌ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ కాలనీలు, బస్తీలను దృష్టిలో ఉంచుకుని లైన్ల విస్తరణ చేపట్టాలని, లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో కరెంట్‌ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. పలు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూములు కేటాయించి ఆమోదించిన కలెక్టర్‌ గౌతమ్‌కు విద్యుత్‌ శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. నూతంగా నూతన్‌కల్‌, యాదారం, సాయినగర్‌లలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూమి కేటాయించాలని విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో మేడ్చల్‌ డివిజన్‌ చీఫ్‌ ఇంజినీర్‌ కామేష్‌, మేడ్చల్‌ ఎస్‌ఈ రవికుమార్‌, హబ్సిగూడ ఎస్‌ఈ బ్రహ్మ, డివిజనల్‌ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

20న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేష్‌

రంగారెడ్డినగర్‌: పేదల ప్రజల పక్షాల సీపీఐ నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్‌ అన్నారు. ఈ నెల 20న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కుత్బుల్లాపూర్‌లో జరిగే మేడ్చల జిల్లా కౌన్సిల్‌ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, వాటి పరిరక్షణ కొరకు ఏర్పడిన హైడ్రా పని తీరుపై చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పరికిచెరువు, గాజులరామారంలో అన్యాక్రాంతమవుతున్న స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ భూములను సాంబశివరావు పరిశీలిస్తారని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రావు, జిల్లా కౌన్సిల్‌ సభ్యుడు నరసయ్య, శాఖ కార్యదర్శి యాకూబ్‌, కుమార్‌, పూర్ణచందర్‌ పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో లిమ్కా బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం



సూర్య నమస్కారాల్లో ప్రతిభ చాటిన యోగా సాధకులతో ఆంజనేయులు

సుభాష్‌నగర్‌: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం అనేది మరిచిపోయారని, ప్రతి ఒక్కరూ విధిగా ఉదయం యోగా చేయాలని ప్రముఖ న్యాయవాది ఆంజనేయులు ముదిరాజ్‌ అన్నారు. ఇటీవల సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్వర్యంలో 4 వేల మందితో శత సహస్ర సూర్యనమస్కార పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాపూర్‌నగర్‌లో శివ శక్తి ధ్యాన యోగా కోచ్‌ విజయకుమార్‌ సారథ్యంలో 11 మంది సాధకులు పాల్గొని 300కు పైగా సూర్య నమస్కారాలు చేసి 30295 రౌండ్‌లో ప్రతిభతో వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ ఇంటర్‌ నేషనల్‌లో స్థానం పొందారు. విజయం సాధించిన యోగా సాధకులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. శనివారం షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఆంజనేయులు, శివ శక్తి ధ్యాన యోగా వ్యవస్థాపకులు మల్లేష్‌ తదితరులు అభినందించారు.

బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



రికార్డుల నిర్వహణ, ఎఫ్‌ఐఆర్‌ నమోదు గురించి వివరిస్తున్న సీఐ

బాలానగర్‌: శిక్షణలో భాగంగా 2024 బ్యాచ్‌ ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో జరుగుతున్న పనులను, వివిధ కేసుల పనితీరును పరిశీలించారు. 2024 ట్రైనీ ఐపీఎస్‌ బ్యాచ్‌కి చెందిన శశాంత్‌ ఎస్‌ఎం, కర్ణాటక, అభిషేక్‌ పిర్రా, రాజస్థాన్‌, హస్సన్‌ రియాజ్‌ (మాల్దీవులు) పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. వీరికి బాలానగర్‌ సీఐ నర్సింహరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్టేషన్‌ పరిధిలో జరిగే వివిధ అంశాల గురించి సీఐ వివరించారు. ఎస్‌ఐలు రాంనారాయణ్‌, హాజిమాయి, సరళ, ఏఎస్‌ఐలు ఆంజనేయులు, ప్రభాకర్‌, స్టేషన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన వివరాల నమోదు

నిజాంపేట్‌: గతంలో వివరాలు ఇవ్వని వారు ఆదివారం నుంచి జరిగే కులగణనలో వివరాలు ఇవ్వాలని మున్సిపల్‌ కమిషనర్‌ సాబేర్‌ అలీ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం గతంలో చేపట్టిన ఇంటింటి కుల గణనలో వివిధ కారణాల వల్ల సర్వే వివరాలు నమోదు చేసుకోలేని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 28వ తేదీ వరకు ప్రభుత్వం మరొక అవకాశం కల్పించిందన్నారు. టోల్‌ ఫ్రీ నంబర్‌ 040–21111111 ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే మున్సిపల్‌ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులో వివరాలు నమోదు చేసి అక్కడే అధికారులకు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ఆలయంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: శ్రీసాయి కాలనీ, చింతల్‌లోని అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్‌ అన్నప్రసాద సేవా ట్రస్ట్‌ చైర్మన్‌ కన్నేకంటి లక్ష్మణ్‌, ప్రెసిడెంట్‌ కల్యాణ్‌ రావు పాటిల్‌ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సుభాష్‌నగర్‌: ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మరోసారి పెద్ద ఎత్తున కూల్చివేశారు. గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్‌ 342లో 3 గదులు, ఒక బౌండరీ, సర్వే నంబర్‌ 307లో 4 గదులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గులాం కలీం నేతృత్వంలో శనివారం కూల్చివేశారు. కూలిృవేస్తున్న సమయంలో కేసులు నమోదు చేస్తారన్న భయంతో అక్కడికి ఎవరూ రాలేదు. ఆదివారం సెలవు కావడంతో ఎలాంటి కబ్జాలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

హాస్టల్‌ విద్యార్థులపై దాడి.. కేసు నమోదు

మేడ్చల్‌రూరల్‌: ఎస్టీ హాస్టల్‌ విద్యార్థులపై దాడి జరిగిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇంజినీరింగ్‌ చేస్తూ మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ హాస్టల్లో ఉంటున్న విద్యార్థికి సీనియర్లకు మద్య భోజనం విషయంలో శుక్రవారం రాత్రి వివాదం తలెత్తింది. సేవాలాల్‌ జయంతిపై చర్చ జరుగుతున్నందున కొద్దిసేపు ఆగాలని వారు సూచించగా.. ఈ విషయంపై ఇరువర్గాల మద్య చిన్న ఘర్షణ జరిగింది. నితిన్‌ అనే విద్యార్థి అర్ధరాత్రి బయట నుంచి 30 మందిని హాస్టల్‌కు పిలిపించుకుని సీనియర్లపై దాడి చేశాడని సమాచారం. ఈ దాడిలో బలవీర్‌, శ్రీకాంత్‌, అరుణ్‌, హరీష్‌ తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధర్మభిక్షం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్‌



ధర్మ భిక్షంగౌడ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మ భిక్షంగౌడ్‌ పోరాటస్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్‌ అన్నారు. 103వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదురుగా ఉన్న ధర్మ భిక్షంగౌడ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసి జైలు జీవితం గడిపిన మహానుభావుడని గుర్తు చేశారు. అనేక పర్యాయాలు శాసనసభ సభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా గెలుపొంది నల్లగొండ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు అనేక సేవలు చేశారన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కార్యక్రమానికి శాఖ కార్యదర్శి సహదేవ రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్‌ రావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు రాములు, శాఖ సహాయ కార్యదర్శి రాజు, నాయకులు ఇమామ్‌, నారాయణ, చంద్రయ్య, వెంకటేష్‌ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



బైక్‌ ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: ట్రాఫిక్‌ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. ర్యాన్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌, హైదరాబాద్‌ ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కొంపల్లిలోని స్కూల్‌ ఆవరణలో 10కే ట్రాఫిక్‌ అవేర్‌నెస్‌ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ ధరించాలని, ట్రిబుల్‌ రైడింగ్‌, ఫోన్‌ మాట్లాడుతూ వాహనాలు నడపటం వంటివి చేయకూడదన్నారు. ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలో బాధ్యతాయుతమైన ప్రయాణ పద్ధతులను ప్రోత్సహించడానికి ఈ ట్రాఫిక్‌ అవేర్‌నెస్‌ ర్యాలీని నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ర్యాన్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ అనుసింగ్‌, ట్రాఫిక్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సంత్‌ సేవాలాల్‌



సంత్‌ సేవాలాల్‌ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న బంజారాలు

జగద్గిరిగుట్ట: బంజారాల ఆరాధ్య దైవం సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మగ్దూం నగర్‌ మెరమ్మాయది సేవాలాల్‌ మహరాజ్‌ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట కొండపై ఉన్న ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్‌ జగన్‌, కాంగ్రెస్‌ నాయకులు గణేష్‌, తారా సింగ్‌, రవీందర్‌ నాయక్‌, లక్ష్మి పాల్గొన్నారు.

జాతిని జాగృతం చేసిన గొప్ప సంఘ సంస్కర్త



సేవాలాల్‌ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న..

నిజాంపేట్‌ : గిరిజన జాతులనే కాకుండా హిందూ జాతిని జాగృతం చేసిన గొప్ప సంఘ సంస్కర్త సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ అని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ ఆచార్య కోట్ల హనుమంతరావు అన్నారు. శనివారం తెలుగు వర్సిటీలో ఏర్పాటు చేసిన 286 సేవాలాల్‌ మహరాజ్‌ జయంతోత్సవాలను ఆయన ప్రారంభించారు. చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింస, మతసామరస్యం, దైవ చింతనలతో కూడిన తాత్విక ధర్మ ప్రబోధనలను పంచిన ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సేవాలాల్‌ మహరాజ్‌ అని గుర్తు చేశారు. బంజారా సమాజంలో ఆనాటి మూఢ నమ్మకాలను తొలగించడానికి జంతుబలిని వ్యతిరేకించి, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని, అహింసా మార్గాన్ని పాటించాలని హితబోధ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డా.రాధా సారంగపాణి, వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్‌ బాలాజీ నాయక్‌, సాయికుమార్‌ నాయక్‌, డా.విజయ్‌ పాల్‌, విద్యార్థులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ పోలీసుల స్పెషల్‌ డ్రైవ్‌



సుభాష్‌నగర్‌: వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వెలిసిన షాపులపై జీడిమెట్ల ట్రాఫిక్‌ పోలీసులు శనివారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌ నుంచి కుత్బుల్లాపూర్‌ చౌరస్తా వరకు ఎడమ పక్కన రోడ్డుపై వెలసిన 20 డబ్బాలు, దుకాణాలు, స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే షాపూర్‌నగర్‌– బాలానగర్‌ ప్రధాన రోడ్డు వెంబడి దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని తెలిపారు. మొదటి రోజు ఒక పక్క తొలగించామని, దశలవారీగా మిగతా చోట్ల తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆటో యూనియన్‌ నాయకులు

సుభాష్‌నగర్‌: తెలంగాణ ప్రోగ్రెసివ్‌ ఆటో అండ్‌ మోటార్‌ వర్కర్స్‌ యూనియన్‌ (టీయూసీఐ) కొంపల్లి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కొంపల్లిలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్‌ జిల్లా నాయుడు కృష్ణ ముదిరాజ్‌, కొంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు వెంకటేష్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఇచ్చిన రూ.12 వేల హామీ ఇప్పటి వరకు నోచుకోలేదన్నారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలని, అదే విధంగా ఆటో మీటర్‌ ఛార్జీలు పెంచాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు అశోక్‌, సత్యనారాయణ, మహ్మద్‌ మౌలానా, జెక్కి రాజు, మధు, వెంకటేష్‌, విజయ్‌ కుమార్‌, గణేష్‌, వీరేష్‌, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ నిర్మూలనపై అవగాహన



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: డ్రగ్స్‌ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాంటీ నార్కోటిక్‌ బ్యూరో ఎస్పీ సీతారాం అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో యాంటి డ్రగ్స్‌ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్‌ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్‌ వినియోగించడం వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని, దీంతో చదువుపై శ్రద్ధ తగ్గిపోయి సంఘ వ్యతిరేక శక్తులుగా మారతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్య ఎంతో విలువైందని, యువత చెడు దారిన వెళ్లకూడదని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌ మాట్లాడిన అనంతరం విద్యార్థులతో పోలీసులు డ్రగ్స్‌ నివారణ ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాంటీ నార్కోటిక్‌ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రావు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ రత్నకుమారి, ఏవో రాజేష్‌, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్‌ కో– ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.